కథ

# పెళ్ళిసందడి

ఆరోజు మా ఇంట్లో ఎవరిదీ పెళ్ళికాకపోయినా అప్పుడే మా ఇంటికి పెళ్ళి కళ వచ్చేసింది. నా పెళ్ళి విషయమై బంధుజనంతో పెద్ద సమావేశం ఏర్పాటు చేశారు.

ససేమిరా నేనప్పుడే పెళ్ళి చేసుకోనని అంటున్నా వినకుండా ఈ అర్జంటు మీటింగుకు మా బామ్మ ఛైర్మన్.

మా మేనమామ కూతురు దివ్యను వెంట బెట్టుకుని మా అమ్మ తరుపు బంధువులు, మా మేనత్త కూతురు రమ్యను తీసుకొని మా నాన్న తరుపు బంధువులు మా బామ్మ పంపిన టెలిగ్రాముల్ని అందుకుని నిన్ననే మా ఇంట్లో రెక్కలు కట్టుకు వాలిపోయారు.

మా ప్రక్కింటి సౌమ్యను తీసుకొని వాళ్ళ తాతగారు, మా ఎదురింటి భవ్యను తీసుకొని మా అక్కయ్య ఉదయమే వర్జ్యం చూస్కొని మరీ మా ఇంట్లో కాలెట్టారు.

ఒక ప్రక్క దివ్యను పెళ్ళాడనంటే నూతిలో దూకుతాననే బెదిరింపుతో మా అమ్మ, రమ్యను వివాహం చేసుకోనంటే ఆస్తిని అనాథ శరణాలయానికి రాసి పడేస్తానని మా నాన్న నన్ను బ్లాక్ మెయిల్ చేస్తూ కాకుల్లా పొడుస్తుంటే..మరో ప్రక్క సౌమ్యనే చేసుకోమని మా తాతగారి పట్టు! ఎందుకంటే సౌమ్య తాతగారు మా తాతగారి ప్రాణస్నేహితులుమరి! సౌమ్య మా ప్రక్కింటి అమ్మాయే కాబట్టి చిన్నప్పట్నుంచీ తెలుసు.

ఇంకో ప్రక్క తమ ఆడపడుచు భవ్యను చేస్కోమని మా అక్కయ్య ఒకటేపోరు. మా అక్కయ్యంటే సొంత అక్కయ్యకాదు. మా పెదనాన్నగారి అమ్మాయి. వాళ్ల అత్తారిది మా ఎదురింటి ఇల్లే!

మా అక్కయ్య కూతురు వయస్సులో నాకంటె చాలా చిన్నది కాబట్టి బతికిపోయాను. లేకుంటే వాళ్లమ్మాయిని కూడా ఈ పోటీలో పెట్టేది.

భవ్య మా చెల్లాయి క్లాస్‌మేట్ మరియు క్లోజ్ ఫ్రండూను. మా చెల్లాయి కోసం మా ఇంటికి ఎక్కువగా వస్తుంది కాబట్టి భవ్య కూడా చిన్నప్పట్నుంచీ బాగా తెలుసు.

మా చెల్లాయి ఫ్రండని భవ్యను మా చెల్లాయేమీ రికమెండు చేసి నన్ను ఇబ్బంది పెట్టలేదు.

''ఒరేయ్ బుజ్జిబాబూ! ఈ నలుగురమ్మాయిల్లో ఎవర్ని నువ్వు పెళ్ళి చేసుకున్నా నాకభ్యంతరం లేదు! కాని, ఈ నల్గురిలో ఎవరో ఒకర్ని పెళ్ళి చేసుకు తీరాలి. వచ్చే నెల్లోనే ముహూర్తం. పంతులుగార్ని కూడా రమ్మని కబురు పెట్టాను. ఈపాటికి బయలుదేరుంటారు!'' అది మా బామ్మ తిరుగులేని అల్టిమేటమ్.

మా బామ్మ తనకు తానుగా ఎవర్నీ రికమెండు చేయకపోవడంతో నామీద ఎంతో వత్తిడి తగ్గినమాట నిజం. ఎందుకంటే చిన్నప్పట్నుంచి మా బామ్మకు నేనంటే ప్రాణం. పైగా బామ్మ పేరు మీద బోల్డు ఆస్తివుంది.


''ఒక పని చేద్దాం! లాటరీ వేసి చూస్తే మా వదినెవరో తేలిపోద్ది!'' గడుసుగా అంది మా చెల్లాయి తన ఆడపడుచు పెత్తనానికి భంగం వాటిల్లకుండా ముందే ప్లాను చేసుకుంటూ.

ఆమె మాటలకి అందరూ నవ్వేశారేగాని ఎవ్వరూ అంతగా పట్టించుకోలేదు.

మా ఇంటి ఆవరణలోని పచ్చిక బయల్లో సమావేశం ఏర్పాటు చేయబడింది. అందరూ నేనేం చెప్తానోనని నావైపే ఆశగా చూస్తున్నారు. ఆ నల్గురిలో ఎవరినీ చేసుకోకపోయినా, ఏ ఒక్కర్ని చేసుకున్నా నా కొంప మునిగినట్లే! అసలీ గొడవలేకుండా అందర్నీ కట్టుకోవడాన్కి నేనేమీ శ్రీకృష్ణ పరమాత్ముడ్ని కాదు మరి! ఆచి తూచి అడుగెయ్యకపోతే..ఆ తర్వాత..జీవితాంతం...ఛీత్కారాలు..నిష్ఠూరాలు..అబ్బోఎన్నో..అందుకే..నా జాగ్రత్తలో నేనున్నాను.


ఏకగ్రీవంగా ఓ అమ్మాయిని సెలక్టు చేయమని నా నిర్ణయాన్ని వాళ్లకే వదిలేశాను ఎందుకొచ్చిన తలపోటని! ఎలాగూ ఈ విషయంలో ఏకగ్రీవం కుదరదని నాకు తెలుసు!

ఒకళ్ల ముఖాలు ఒకళ్లు చూసుకున్నారంతా. ఏకగ్రీవ తీర్మాన ప్రసక్తే లేదని వాళ్లకీ తెల్సిపోయింది. ఆ సమస్య ఎంత కష్టమైందో ఇప్పుడే తెల్సినట్లుంది పాపం వాళ్లకి.



''చూడండి!'' అంటూ అందర్నీ ఒకసారి తేరిపార చూశాను.

అమ్మాయిలు నల్గురూ నావైపే ఆశగా చూస్తున్నారు. అప్పటికే రమ్య ''ప్లీజ్ బావా! నన్నే చేసో!'' అన్నట్లుగా గాల్లో సుతారంగా చేతులూపుతోంది. అది గమనించిన దివ్య ఏకంగా గాల్లోనే ఓ ముద్దిచ్చేసింది. సౌమ్య ఏదో ఆలోచిస్తోంది. భవ్యేమో తన సోగకన్నులతో రెప్పవాల్చకుండా నన్నే చూస్తోంది.



''ఈ నలుగురూ రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమల్లా అందగత్తెలే! అందరూ చదువుకున్నవారే!..ఎవర్లోనూ వేలెత్తి చూపించే లోపం లేదు. పైగా అందరూ ఆణకువైన అమ్మాయిలే!'' అంటూ నా చేతిలున్న డైమండ్ రింగును వాళ్ల మధ్య వున్న టీపాయ్ మీద పెట్టి ''ఈ సమస్యకు పరిష్కారం మీరే చూపి నాముందో అమ్మాయిని నిలబెడ్తే ఆ పెళ్ళికూతురి వేలుకి ఈ ఉంగరం తొడిగేస్తాను!'' అంటూ చేతులు ముడిచి కూచున్నాను. అప్పుడే అమ్మాయిలు ఉంగరం వైపు, తమ వేళ్ల వైపు ఆశగా చూసుకుంటున్నారు.

'ఎప్పుడూ లేంది నీ వేలుకి ఆ డైమండు రింగెక్కడిది?' అన్నట్టుగా చూస్తున్న మా బామ్మ చూపుల్ని పసిగట్టి ''ఈరోజు పెళ్లి కూతురెవరో తేలిపోతే ఉంగరం తొడిగి పెళ్ళి ఖాయం చేస్కోవచ్చని నేనే రాత్రి షాపులో కొన్నాను'' అన్నాను బామ్మవైపు చూస్తూ.

మా బామ్మ తెగ ఆనందపడిపోయింది, పెళ్ళి ఇప్పుడే చేస్కోనన్న నేను తన మాటకు విలువిచ్చినందుకు.

మా అమ్మ దివ్యను నాముందుకు తోస్తూ ''దివ్యకు కుట్లుపని బాగా వచ్చురా!'' అంటుంటే ఆ ప్రక్కనే వున్న మా మేనమామ భార్య ఆనందంతో అవునన్నట్లు తలూపుతోంది.

''రమ్య పాటలు బాగా పాడ్తుందిరా!'' నాన్న రమ్యను మెచ్చుకుంటుంటే ఎవరా మేనత్త పెనిమిటి సపోర్టు చేస్తున్నాడు.

పిండివంటలంటే లొట్టలేసుకు తినే మా తాతగారు ఏకంగా సౌమ్యను నా ప్రక్కన నిలబెట్టేసి ''సౌమ్య పిండి వంటలు బాగా చేస్తుంది. పైగా మీ ఇద్దరికీ ఈడూ జోడూ కుదిరిందిరా!'' మెచ్చుకుంటుంటే సౌమ్య తాతగారి వంతపాట.

''భవ్య మంచి రచయిత్రిరా!'' అక్కయ్య సపోర్టుకి మా బావగారి తాన తందన.

''ఒక పని చేస్తే?'' ఉన్నట్టుండి మా చెల్లాయి అంది. అందరూ ఆవేంటనే చూశారు.

మా బామ్మ మా చెల్లాయిని చూస్తూ ''ఈ ఇంటి ఆడపడుచువి. నువ్వే ఓ అమ్మాయిని సెలక్టు చేసి మీ వదిన్ని ఎంచుకో. ఆడపడుచు లాంఛనాలు ఘనంగా ఏర్పాటు చేయిస్తా!'' గట్టిగా సపోర్టుచేసింది.

మా చెల్లాయి తొందరపడే మనిషేం కాదు. ఎవర్ని సెలక్టు చేస్తే తనకేమి ఇబ్బంది వస్తుందోనని కాసేపు ఆలోచించి అందరివైపు చూస్తూ ''ఈ నల్గురి అమ్మాయిల మధ్య నిల్చొని, కళ్ళు మూసుకుని నేను డైమండ్ రింగును పైకి ఎగరేస్తాను..ఎవరికి దగ్గర్లో పడ్తుందో ఆ సుందరే మా కాబోయే వదిన!'' ఏమంటారన్నట్లుగా అంది.

ఆ ప్రపోజల్‌కి మా అక్క బావలు, భవ్య తప్ప ఎవరూ ఒప్పుకోలేదు. భవ్య మా చెల్లాయి ఫ్రెండు కాబట్టి ఆమెకు దగ్గర్లో పడేలా రింగు విసురుతుందేమోనని వాళ్ల అనుమానం మరి! ఆ ప్రపోజలూ వీగిపోవడంతో మా బామ్మ నీరుకారిపోయింది.

ఇంతలో పంతులుగారు రానే వచ్చారు. పంతులుగార్ని సాదరంగా ఆహ్వానించింది మా బామ్మ.

కుర్చీలో కూర్చున్న పంతులుగారు ఓసారి నశ్యం ముక్కులోకి గట్టిగా దట్టిస్తూ ''పెళ్ళి ముహూర్తం పెట్టమని పిలిపించారు. ఇంతకీ అమ్మాయి ఎవరు?'' అందర్నీ పరికించి చూస్తూ అన్నారు.

సీనంతా వివరించింది మా బామ్మ.

పంతులుగారే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారని మా బామ్మ ఆశ.

''దీని గురించి పెద్ద తర్జన భర్జనలు పడ్తూ మీ బుర్రలు పాడు జేసుకుంటారెందుకు? ఆ విషయం నాకొదిలేయండి. అరగంటలో తేల్చేస్తా!'' అన్నారు పంతులుగారు.

పంతులుగారి మాటలకు వాళ్లంతా మెత్తబడినట్లు వాళ్ల ముఖాలే చెప్తున్నాయి.

''చూడండి! మీలో ఆ నలుగురమ్మాయి లెవరోగాని వాళ్ల పేర్లు, పుట్టిన తేదీ, టైము వివరాలు వ్రాసిస్తే చాలు. మీ వాడి జాతకానికి ఏ అమ్మాయి సరిపోతుందో అర్ధగంటలో వ్యవహారం తేల్చిపారేస్తా!'' బామ్మను చూస్తూ అన్నారు పంతులుగారు ముక్కుపొడి డబ్బాను బయటకు తీస్తూ మరోపట్టు పట్టడానికి.

పంతులుగారి ప్రపోజల్‌కి అందరూ ఏకగ్రీవంగా ఒప్పేసుకున్నారు.

మా బామ్మ ముఖంలో ఒకటే ఆనందం! ఇందులో ఇక నా ప్రమేయం లేకపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకుంటూ స్వీట్లున్న ప్లేటు నందుకున్నాను.

నలుగురమ్మాయిల వివరాలు వ్రాయించి ఇచ్చింది మా బామ్మ. పంతులుగారోసారి కళ్ళజోడు సవరించుకొని జాతకాలు చూడడం మొదలెట్టారు.

పావుగంట గడిచింది.

అందరి ముఖాల్లో ఒకటే టెన్షన్ పంతులుగారు ఏం చెప్తారోననే ఆత్రుత..

పంతులుగార్ని సైగల్తో ఎవరూ ఆకట్టుకోకుండా ఒకళ్ల కళ్లు మరొకరి కళ్ళకు కాపలా.

నేను మాత్రం వాళ్ల ముఖాల్లోని టెన్షన్ గమనిస్తూ స్వీటు తింటూ హాయిగా ఎంజాయ్ చేస్తున్నాను.

తమ్మిశెట్టి భుజంగరావు

"మీలో దివ్య ఎవరు?" ఉన్నట్టుండి పంతులుగారన్నారు.

ఆ మాటకు మా అమ్మ ముఖం వెలిగిపోయిందేమో దివ్యను చూస్తూ.

"నీ జాతకం దివ్యంగా వున్నట్లుంది!" అంది.

"ఈ అమ్మాయి ఎవరోగాని.." క్షణం ఆగారు పంతులుగారు ముక్కుపొడి పీల్చడానికి.

అమ్మతో సైతం దివ్య తరుపు బంధువులంతా పంతులుగారి చుట్టూ మూగారు.

"మీ మనుమడ్ని పెళ్ళి చేసుకున్న సంవత్సరం లోగా.."

"పిల్లాడ్ని కనేసి నా చేతుల్లో పెడ్తుందా?" పంతులుగారి మాటలకు అడ్డుపడ్తూ అడిగింది మా బామ్మ.

"కాదు! కాబోయే అత్తగార్ని కోల్పోతుంది!" చల్లగా చెప్పారు పంతులుగారు.

ఆ మాటలకు మా అమ్మ ముఖం చూడాలి. నేచెప్తే బాగుండదు. వెంటనే సైలెంటయిపోయింది. ఆ మాటలకు మా నాన్నగారు ముఖం చాటుగా పెట్టుకుని ఆనందంగా నవ్వుకున్నారు.

"భవ్యంటే ఎవరు?" అడిగారు పంతులుగారు అమ్మాయిల వైపు చూస్తూ.

అక్కయ్య ముఖంలో ఆనందం. ఆ ఆనందం ఎక్కువ సేపు వుంచకుండా పంతులుగారు "ఈ అమ్మాయి జాతకం.." మళ్లీ ఏవో లెక్కలు వేస్తూ కాసేపాగి "అబ్బాయి జాతకానికి అసలు కుదరట్లేదు" అనడంతో మా అక్కయ్య వాళ్లు దిగాలు పడిపోతూ "జాతకం బాగున్నమ్మాయి పేరు చెప్తేసరిపోతుంది కదండి!" అంటూ చిరాకు పడ్డారు.

"రమ్య ఎవరోగాని ఆ అమ్మాయి జాతకం బాగుంది!" అన్న పంతులుగారి మాటలకు మా మేనత్త, మా నాన్నగారి ముఖాల్లో దీపావళి కాంతులు. మా అమ్మ ముఖం ఎందుకో వాడిపోయింది.

"కాని...." వున్నట్టుండి పంతులుగారన్నారు.

"ఈ అమ్మాయికి సంతాన యోగం లేదు!" ఆ మాటలకు మా నాన్న మేనత్తల ముఖాలెలా వున్నాయో నేను గమనించలేదుగాని మా అమ్మ ముఖం మాత్రం మతాబులా వెలిగిపోయింది.

ఇకపోతే సౌమ్య మాత్రం మిగిలిపోయింది. ఆ అమ్మాయి జాతకం కూడా బాగుండకపోతే పీడ విరగడైపోద్దన్నట్లుగా వున్నాయి చాలామంది చూపులు.

మా బామ్మ మాత్రం "దేవుడా! ఈ అమ్మాయి జాతకమైనా బాగుండేట్టు చూడు!" అంటూ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు కళ్ళు మూసుకుని కన్పించింది.

"సౌమ్యంటే ఎవరో గాని ఆ అమ్మాయి జాతకం మీ మనుమడి జాతకంతో అద్భుతంగా కుదిరింది!" అన్నారు పంతులుగారు మా బామ్మని చూస్తూ.

"కాని..."క్షణం ఆగారు పంతులుగారు వేళ్లతో ఏవో లెక్కలు వేస్తూ.

అందరి ముఖాల్లో ఒకటే ఉత్కంఠ, అసలే మా బామ్మకి హై బి.పి. మా బామ్మ ముఖంలోని టెన్షన్ చూస్తూ మా తాతగారు కంగారుపడిపోతున్నారు.

"వచ్చేనెల్లోనే ముహూర్తం..అది దాటితే సంవత్సరం వరకు సరైన ముహూర్తాలు లేనే లేవు!" పంతులుగారన్న ఆ మాటలకు మా బామ్మ ముఖంలో ఆనందం వర్ణనాతీతం.

మిగతా ముగ్గురమ్మాయిలూ సౌమ్యను అసూయగా చూస్తుంటే ఏ గొడవ లేకుండా పెళ్ళి నిర్ణయం సాఫీగా జరిగి పోవడంతో హాయిగా ఊపిరిపీల్చుకుంటున్న నా దగ్గర కొచ్చి నన్ను అభినందించి షేక్ హాండిచ్చారు మా తాతగారు.

నేనెక్కడ మనస్సు మార్చుకుంటానోనన్న ఆందోళనతో మా బామ్మ డైమండ్ రింగును తీసుకుని నా దగ్గరకొచ్చి సౌమ్య చేతిని నాకందిస్తూ రింగును తొడిగే వరకు ఊరుకోలేదు.

"అదృష్టమంటే నీదేనమ్మా! ..నీ వేలుకి ఉంగరం కూడా సరిగ్గా సరిపోయింది!" అంటూ బామ్మ సౌమ్య తలమీద చేయివేస్తూ ఆప్యాయంగా నిమిరింది.

మా ఇద్దరి చూపులు క్షణం పాటు కల్సుకుని విడిపోయాయి. మా జంటను చూస్తూ పంతులుగారు దీవిస్తున్నట్టు గాల్లో చేతులూపుతూ ఏవో సైగలు చేశారు. ఆ సైగల్ని అర్థం చేసుకున్న మేము గుంభనంగా నవ్వుకున్నాము.

పంతులుగారు మమ్మల్ని చూస్తూ సైగలెందుకు చేశారో, ఆ డైమండ్ రింగు సౌమ్య చేతికే సరిగ్గా ఎందుకు సరిపోయిందో చెప్పేస్తే మళ్లీ కథ మొదటికొచ్చేయదూ? అందుకే- అంత సస్పెన్స్!

మా ఇంట్లో పెళ్ళికూతురి గొడవ సద్దుమణిగింది! పెళ్లిసందడి మొదలయింది! ★


కరకరలాడే వడలు తయారు చేయండి (మిమ్మల్ని మీరు ఫ్రై చేసుకోకుండానే)

సమర్పిస్తున్నది FGతో అల్ట్రా గ్రైండ్ ప్లస్.

మరో విప్లవాత్మక ఉత్పత్తి, టేబుల్ టాప్ గ్రైండర్స్‌లో ప్రమాణాలను నెలకొల్పిన వారి నుండి విశిష్టమైన ఫ్రెష్ గ్రైండ్ (FG) సౌకర్యంతో అల్ట్రా గ్రైండ్ ప్లస్. తాజా అయిన సున్నితమైన వాటికొరకు మరింత బలవత్తరమైనది. మృదువైన ఇడ్లీలు, పల్చని దోసెలు, కరకరలాడే వడల కొరకు అవసరమైన సాధనం. ఇవన్నీ గతంలో ఎన్నడూలేనంత తొందరగా.



అల్ట్రా గ్రైండ్ ప్లస్ మీకోసం అన్నింటిని సులభతరం చేస్తుంది - ధరతోసహా!

ULTRA PRIDE+ ULTRA GRIND+

THE BETTER BATTER GRINDERS

అన్ని ప్రసిద్ధమైన షాపులలో లభించును

Patent No: 179607
Design Regd. No. 175994, 175995 & 163445, 163446
UNIQUE INVENTION



Conical Grinding Stones

ఎల్జీ అల్ట్రా ఇండస్ట్రీస్ లిమిటెడ్

ఎల్జీ హౌస్, తిరుచ్చి రోడు, కోయంబత్తూరు - 641 045.

ఫోన్: 314571, 314589, 316132, 313984. ఫ్యాక్స్: 0422-311740.

SASI/116/99

ప్రాంతీయ కార్యాలయాలు: ● నెం.1-8-522/21/1, చిక్కడపల్లి, హైదరాబాదు - 500 020 ఫోన్: 7601135, 7673578 ● నెం. 32-26-91, మారుతీనగర్, విజయవాడ - 520 004. ఫోన్: 430619 ● నెం. 50-88-1, శాంతిపురం, మధురా నగర్, విశాఖపట్నం - 530 016. ఫోన్: 548073.

అల్ట్రా సౌకర్యం. అల్ట్రా అనుభవం.